# కథ అడ్డం తిరిగింది

ఎ.సురూప శరత్‌రావు

"సుబ్బీ ... ఇంకా ఆ మొద్దు నిద్రేమిట్రా...

సూర్యోదయమైనా ...తూర్పు వైపుకుకాళ్ళు బార్లాచాపి పడుకుంటాడు !

ఈ వెధవకి ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాదు... ఇప్పుడే వీడింత మొండికేస్తే పెళ్ళి కాస్తా అయ్యిందంటే ఇహ వీడిని ఆపటం నావల్ల కాదు బాబోయ్ . ఇక ఆ బాబాదయ తోనే వీడు మారాలి."

స్టీరియో ఫోనిక్ సౌండ్‌లో అరుస్తోంది బామ్మ.



"ఒసే బామ్మా! పోయిన జన్మలో నువ్వు కాకివేమోనని అనుమానంగా ఉందే! లేకపోతే ఏమిటి... ఇలా పొద్దున్నే కాసేపైనా పడుకోకుండా నీ గోల! " విసుక్కున్నాడు సుబ్బారావు ముసుగు తీయకుండానే.

" హారి భడవా... నన్ను కాకీ అంటావట్రా ! బొత్తిగా భయమూ, భక్తీ లేకుండాపోయాయి నీకు! లే... తలస్నానం చేయిస్తాను " అంటూ దుప్పటి లాగేసింది బామ్మ.

"ఒసే బామ్మా నీ ఛాతుకాలకు అంతుండక్కర్లా...ఉన్న పళంగాదుప్పటి లాగేస్తే ఎలా ? అయినా ఈ రోజు ఏమిటి విశేషం బామ్మా ...తలస్నానం పోస్తానంటున్నావు ? "విసుగ్గా మొహం పెట్టి అడిగాడు సుబ్బు.

"సరేలేరా ! చెవిటి వాడిముందు శంఖూదినట్టుంది నీ వాలకం... వారం రోజుల్నుండీ చెబుతూనే ఉన్నాను.. ఈ రోజు గురువారం ...బాబా పూజచేసి ఉపవాస ముండాలనీ ... ! కలియుగ దైవమైన ఆ బాబా ను భక్తితో పూజిస్తే నీకే మంచిది .." అంది బామ్మ.

"బామ్మా ... నా బంగారుతల్లివి కదూ... ఆ పూజలూ ...ఉపవాసాలేవో నీవే చేసి ప్రసాదం కాస్తా నాకు ఇచ్చావంటే భక్తిగా కళ్ళకద్దుకుని సేవిస్తాను! అంతేగాని ఇలా చాదస్తాలతో నా ప్రాణం తియ్యకే, నీకు పుణ్యం ఉంటుంది!

"ఒరే సోమరిపోతూ... ఈ పూజలన్నీ నా కోసమట్రా... నీకు మంచి పెళ్ళాం రావాలనీ...నువ్వు సుఖపడాలనే కదా ఇవన్నీనూ..."

గబగబా లేచి స్నానం ముగించుకుని బామ్మగారి దండకం ధాటికి తట్టు కోలేక గంటముందే ఆఫీసుకు పరిగెట్టాడు.

సాయంకాలం ఆఫీస్ నుండి ఇంటికివచ్చేసరికి గుమ్మంలోనే ఎదురైంది బామ్మ. మనవణ్ణి వాటేస్కుని-- "ఒరే సుబ్బిగా, నే చెప్పలేదూ...నీకు మంచి పెళ్ళాం వస్తుందనీ ... అదే నిజమయింది సుమీ... పెళ్ళిళ్ళ పేరయ్య నీకో మంచి సంబంధం తెచ్చాడు.అమ్మాయి లక్షణంగా ఉంటుందట... పైగా బాబా అంటే ఎనలేని భక్తీ ...అభిమానమూఉన్న అమ్మాయిట! అంతా నేను కోరుకున్నట్లే జరుగుతోంది ..." అంది బామ్మ.

"హత విధీ... ఏమిటీ పరీక్ష! బామ్మా... ఆ అమ్మాయీ కలిసి నన్నెన్ని ఉపవాసాలుచేయిస్తారో..." నిట్టూర్చాడు సుబ్బు.

"నీ పెళ్ళి చూడకుండానే ఎక్కడ హరీ మంటానో అని ఇన్నాళ్ళూ దిగులు పడ్డాను. ఇన్నాళ్ళకి ఆ దేవుడు కరుణించాడు " అంటూ పవిటతో కళ్ళు అద్దుకుని...ముక్కు చీదుతుంటే చెంగున పక్కకి తప్పుకున్నాడు సుబ్బు.

"అక్కటా! బామ్మ చాదస్తాలతోనే వేగలేకపోతూంటే మరో చాదస్తపు శాల్తీని నాకు రాసిపెట్టావా దేవుడా! ఏమిటీ పరీక్ష..."

ఎప్పుడోచదివిన గడ్డ బిడాలము కథలోని " హా! చచ్చితినికదా సురిగిపోనైతిని... కడుదాపునకు వచ్చితిని' " అనే మాటలు తలచుకుని కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి ముగుగుతన్ని పడుకున్నాడు సుబ్బు.

ఓ శుభముహూర్తాన వాళ్ళ పెళ్ళి వైభవంగా జరిగింది.

కొత్త పెళ్ళి కూతురు తల్లో పూలు తురుముతూ, బామ్మ మురిపెంగా అడిగింది.

" ఏమ్మా ! నీక్కూడా బాబా అంటే చాలా ఇష్టమనీ, ఎనలేని భక్తీ అనీ మీ వాళ్ళు చెప్పారు.... నిజమేనా..."

"అవును బామ్మా! బాబా పాటలన్నా... డాన్సులన్నా నాకెంతో ఇష్టం !" బిడియంగాచెప్పింది.

"పాటలూ,డాన్సులూనా..నువ్వేం చెబుతున్నావో నాకు ఒక్క ముక్కాఅర్థమయి చావటంలేదు! "అంటూముక్కున వేలేసుకుని విస్తుపోయి చూస్తోన్న బామ్మను చూస్తూ...

"అదేంటి బామ్మా...మీరెప్పుడూ అతని పాట విన్లేదా - బాబా సెహగల్ అంటే తెలీనివారే ఉండరు... మొన్నటికి మొన్న రిక్షావోడు లో 'రూప్ తేరా మస్తానా ... నీకు డేరా వేస్తానా " అంటూ ఎంత బాగా పాడాడనుకున్నారు !"

" ఏమిటీ ...బాబా అంటే అతనా "అంటూ షాక్ లోంచి తేరుకోని బామ్మ దబ్బున కుర్చీలో కూలబడిపోయింది.

బామ్మ పరిస్థితికి జాలేసినా ఎదురుగా వెళ్ళే ధైర్యం లేక "తలచినదే జరిగినదా దైవం ఎందులకూ ?' అనిపాడుకుంటూ మెల్లిగా పడగ్గదిలోకి జారుకున్నాడు సుబ్బు ఉరఫ్ సుబ్బారావు.


ఎ.సురూప శరత్‌రావు
కేరాఫ్ ఎ. శరత్ రావు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్
ఆర్మూర్ ( పోస్ట్)
నిజామాబాద్ (జిల్లా).